క్లుప్తంగా

భూమిపూజకు మంత్రికి ఆహ్వానం



మంత్రి హరీష్‌రావును ఆహ్వానిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: మొయినాబాద్ మండలం పెద్ద మంగళవారం గ్రామంలో అతి ప్రాచీనమైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా ఈ నెల 17న భూమిపూజ కార్యక్రమానికి మంత్రి హరీష్‌రావును ఆహ్వానించినట్లు ప్రముఖ సంఘ సేవకులు రిదేష్ జాగిర్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓల్డ్ టెంపుల్ రిన్నొవేషన్ ట్రస్ట్ చైర్మన్ ఆర్‌కె.జైన్, వైస్ చైర్మన్ రిదేష్ జాగిర్దార్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

డబీర్‌పురా: డబీర్‌పురా కోమటివాడి ప్రాంతంలోని గోల్డెన్ డీసెంట్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ ముజతబా హుస్సేన్ ఆబేదీ, ఉపాధ్యక్షులుగా పి.వేణుగోపాల్, నూర్ హైదర్, జోహార్, ప్రధాన కార్యదర్శిగా అమీర్, కోశాధికారిగా జాకీర్, కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రటరీగా చందర్‌లాల్ ఎన్నికయ్యారు.

మహిళల కోసం సేవా కార్యక్రమాలు



చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ పద్మ వీరపనేని

గోల్కొండ : మహిళల కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి అండగా ఉంటామని రైజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ పద్మా వీరపనేని అన్నారు. సోమవారం రైజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో షేక్‌పేట్‌లో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. మహిళలు పొదుపు సంఘాలు, వ్యాపారం చేసుకోవడానికి అండగా ఉంటామన్నారు.

జోషి సమాజ్ అభివృద్ధికి కృషి



సమావేశమైన జోషి సమాజ్ సభ్యులు

గోల్కొండ: జోషి సమాజ్ కులస్తుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని జోషి సమాజ్ అధ్యక్షుడు ఎం. ఈశ్వర్ జోషి అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌లో జోషి సమాజ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని పార్టీలవారు జోషి సమాజ్‌కు మద్దతుగా ఉన్నారన్నారు. సమాజ్ పదాధికారులు లక్ష్మణ్, సి. విజయ్, ఎం.అర్జున్ పాల్గొన్నారు.

టేబుల్ కేలెండర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: టీఎస్ మాసా రెవెన్యూ హైదరాబాద్ జిల్లా శాఖ రూపొందించిన టేబుల్ క్యాలెండర్–2023ను జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో శాఖ అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్, రాష్ట్ర కార్యదర్శి అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ కుమ్మరి బస్తీలో అత్తాపూర్ కుమ్మరి సొసైటీ ఆధ్వర్యంలో కవయిత్రి ఆకునూరి మొల్లమాంబ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరి సంఘం సభ్యులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, 16వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయుల కాలంలో తొలి తెలుగు కవయిత్రిగా మొల్లమాంబ గుర్తింపు పొందారన్నారు. వాల్మీకి రచించిన రామాయణాన్ని తెలుగులో సరళ శైలిలో కేవలం ఐదు రోజుల్లో అనువదించిన మహా ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్

నాంపల్లి: రైల్వే స్టేషన్ ప్రాంగణంలో గుర్తు తెలియని వస్తువులు, పేలుడు పదార్థాలు కనిపిస్తే వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్‌ఆర్‌పీ అర్బన్ ఎ.నర్సయ్య కోరారు. సోమవారం హైదరాబాదు రైల్వే స్టేషన్‌లో పని చేస్తున్న రైల్వే సిబ్బందికి అవగాహన సదస్సు జరిగింది. ప్యాడ్ లాకర్స్, బెడ్‌రోల్, క్లీనింగ్ సిబ్బంది అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రయాణికులెవరైనా తమ వస్తువులు, బ్యాగులు మరిచిపోతే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. హైదరాబాదు ఐపీఎఫ్ సరస్వత్, ఎస్ఎస్ఈ జనరల్ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి



మొక్కలు నాటుతున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, శ్రీనివాస్ రెడ్డి, మమతా సంతోష్‌గుప్తా

అబిడ్స్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీహెచ్ఎంసీ మాజీ మేయ‌ర్ బొంతు రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం గన్‌ఫౌండ్రీలో మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌గుప్తాలు మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలు నాటారు. మానవాళి మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి దానిని పర్యవేక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ కవిత జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గోల్కొండ: ఈ సంవత్సరం 10వ తరగతి రాస్తున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకిలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఉపాధ్యాయులు ఇచ్చిన సూచనలను పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్



సర్టిఫికెట్లతో శ్రీకాంత్ చారి తదితరులు

గోల్కొండ: విద్యా సంస్థలో పని చేస్తున్న వారు సీపీఆర్ శిక్షణ తీసుకోవాలని క్రియేటివ్ ట్రైనింగ్స్ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీనారాయణ్ ప్రొద్దుటూర్ అన్నారు. వివిధ విద్యాసంస్థలతో పాటు గ్లెండేల్ అకాడమీ వారు అడ్మిన్ అండ్ క్రీడా విభాగం ఆధ్వర్యంలో సిపిఆర్‌లో శిక్షణ తీసుకున్న వారికి సోమవారం సర్టిఫికెట్ అందించారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



వేడుకల్లో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు నందకిశోర్ వ్యాస్‌బిలాల్ తదితరులు

అబిడ్స్: దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు ఆదరణ లభిస్తుండడంతో బీజేపీ ఓర్వలేకపోతోందని రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు నందకిశోర్ వ్యాస్‌బిలాల్ పేర్కొన్నారు. సోమవారం గోషామహల్ రోడ్డులోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్‌ను ప్రజలు ఎలా ఆదరించారో దేశవ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పి.అనిత, పరమేశ్వరీ సింగ్ పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాల వేలం

గన్‌ఫౌండ్రీ: వివిధ కారణలతో సీజ్ అయిన వాహనాలను నగర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గోషామహల్ పోలీస్ స్టేడియంలో వేలం వేశారు. 962 వాహనాలను వేలం వేయగా రూ.66,19,000 ప్రభుత్వ ఖజానాకు జమచేసినట్లు పోలీస్ హెడ్‌క్వార్టర్స్ జాయింట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ–2 అశోక్‌కుమార్, అదనపు డీసీపీ ఎం.శ్రీనివాసరావులతో పాటు ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన 550 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

ఓరియంటేషన్ కోర్సుతో ఎంతో మేలు



వినితా పాండేకు ఒప్పంద పత్రాన్ని అందజేస్తున్న సునీల్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థుల్లో నైపుణ్య శక్తిని పెంపొందించడానికి యూత్ ఓరియంటేషన్ కోర్సు ఎంతగానో దోహద పడుతుందని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం సోషియాలజీ విభాగాధిపతి వినిత పాండే అన్నారు. సోమవారం ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ, తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం సోషియాలజీ విభాగాం మధ్య ఎంఓయూ కుదిరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ విజ్జులత సహకారంతో పిల్లల్లో నైపుణ్య శక్తిని పెంపొందించేందుకై వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు.

బైక్ డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం... ఆదివారం రాత్రి 2 గంటల ప్రాంతంలో ఓల్డ్ కర్నూల్ రోడ్డు రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వద్ద బైక్ డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడిని ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ యువకుడు తన పేరు జుబేర్‌ఖాన్, తీగలకుంట ప్రాంతంలో ఉంటానని పోలీసులకు చెప్పాడు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలపలేదని, ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్‌బోర్డులో పెండింగ్ బకాయిలను చెల్లించండి



వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్‌కు మెమోరాండం అందజేసిన పోల్కం శ్రీనివాస్

అబిడ్స్ : మెట్రో వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ యునైటెడ్ కాంట్రాక్టర్ ఫోరం సెక్రెటరి, మీడియా ఇన్‌చార్జ్ పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్టర్లకు పాత బకాయిలు చెల్లించకపోవడంతో అప్పులపాలవుతున్నారన్నారు. సోమవారం వాటర్‌బోర్డు ఎండీ దాన కిశోర్‌కు పాతబకాయిలు చెల్లించాలని మెమోరాండం అందజేశారు. కాంట్రాక్టర్లకు శాపంగా మారిన ఏఎంఎస్ విధానం పెట్టడంతో కాంట్రాక్టర్లు రోడ్డు పాలవుతున్నారన్నారు.

వంతెనెక్కితే వడ్డనే!

పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై ద్విచక్ర వాహనాల ప్రవేశానికి చెక్

- హెచ్ఎండీఏతో కలిసి ట్రాఫిక్ పోలీసుల చర్యలు
- సీసీ కెమెరాలతో నిఘా
- బ్రిడ్జి ఎక్కితే అపరాధ రుసుం విధింపు



ఆదివారం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై వెళ్తున్న ద్విచక్ర వాహనం

రాజేంద్రనగర్: నిబంధనలకు వ్యతిరేకంగా పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు చెక్ పెట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్స్‌ప్రెస్‌వే పై ద్విచక్ర వాహనదారులు ప్రయాణించకుండా ఉండేందుకు హెచ్ఎండీఏతో కలిసి తగు చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు.

ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. సరోజినీదేవి ఆసుపత్రి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు 11 కిలో మీటర్ల మేర నిర్మించిన పీవీఎస్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే కేవలం కార్లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. ద్విచక్ర వాహనాదారులు, భారీ వాహనాలకు అనుమతి లేదన్నారు. కానీ కొందరు ద్విచక్ర వాహనాదారులు ఈ వంతెనపై నుంచి ప్రయాణిస్తూ ఇబ్బందులు సృష్టిస్తున్నారన్నారు.

- గతంలో ఈ వంతెనపై ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై మృతి చెందిన ఘటనలు సైతం జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో పీవీఎస్ ఆర్ ఎక్స్‌ప్రెస్ వే ద్విచక్ర వాహనదారుల ప్రవేశాన్ని అరికట్టేందుకు హెచ్ఎండీఏతో పలు మార్లు సంప్రదింపులు జరిపి తగు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.
- ఎక్స్‌ప్రెస్‌వే వంతెనపై ఎక్కేందుకు, దిగేందుకు ఏర్పాటు చేసిన ర్యాంపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.
- ఈ నెల చివరి నాటికి ఈ పనులు పూర్తి అవుతాయన్నారు. సీసీ కెమెరాల ద్వారా వాహనాదారులను గుర్తించి అపరాధ రుసుం వేస్తామన్నారు.
- సీసీ కెమెరాలను పర్యవేక్షించేందుకు పోలీస్‌స్టేషన్‌లోనే తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఫ్లై ఓవర్ ర్యాంపుల వద్ద సీసీ కెమెరా వాహనాన్ని గుర్తించి అపరాధ రుసుం విధించేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి బస్తీలలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన పార్టీ నాయకులు, పలువురు అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని ఎస్‌ఆర్టీ కాలనీ, యాకుత్‌పురా రైల్వే స్టేషన్ రోడ్డు, సూపర్‌బజార్, మౌలాకా చిల్లా, మదీనానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ అధినేత, ఎమ్మెల్యేల ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నామన్నారు.

డాక్టర్ రాజారెడ్డికి ప్రతిభా పురస్కారం



సుల్తాన్‌బజార్: బహుముఖ ప్రజ్ఞాశాలి హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు 125వ జయంతి వేడుకలు సోమవారం శ్రీకృష్ణ దేవారాయ భాషా నిలయంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవి. రమణాచారి హాజరై సుప్రసిద్ధ వైద్యుడు, నాణేల పరిశోధకుడు డాక్టర్ దేమె రాజారెడ్డికి బూర్గుల రామాకృష్ణారావుకు ప్రతిభ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... బూర్గుల రామకృష్ణారావు సమాజానికి ఎంతో మేలు చేశారన్నారు.

విద్యార్థులకు అండగా జనహిత ట్రస్ట్

గోల్కొండ: విద్యార్థులకు జనహిత చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ జ్ఞాపకార్థం జనహిత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం గుడిమల్కాపూర్‌లో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, దేవర శ్రీనివాస్, నామ యాదగిరి దేవర వంశీ తదితరులు ఉన్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

మహిళల అభ్యున్నతికి కృషి



పురస్కారాలను అందజేస్తున్న సునితా లక్ష్మారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునితా లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమి, ఏబీసీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో పలువురికి ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... మహిళల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు నృత్య గురువులకు మయూరి రత్న పురస్కారాలను, వివిధ రంగాలలో రాణిస్తున్నటువంటి మహిళలకు వివిధ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె.దామోదర్ గుప్తా, భారత ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు లయన్ కేవి.రమణారావు, ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లలిత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు. దుర్గానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.



మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

రాజేంద్రనగర్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాజేంద్రనగర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యలో ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుద్ధ్య, ఇతర విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో వేలాది మంది పని చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సర్వీస్‌ను రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఎ.సాయిలు, మండల ప్రధాన కార్యదర్శి టీ.ఆనంద్, మండల కోశాధికారి ఎ.రాజు, మండల నాయకులు పెంటయ్య, మోహన్, సామేలు, శ్రీను, నరహరి, రాజేష్, ప్రేమిల, సంతోష్, సరస్వతి, లక్ష్మమ్మ, పుష్పమ్మ, ఎల్లమ్మ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు

అబిడ్స్: టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. గోషామహల్ ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్‌లో పోలింగ్ స్టేషన్, నాంపల్లి డిగ్రీ కళాశాలలో ఉన్న పోలింగ్ బూత్‌లలో టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోషామహల్ ప్రాంతంలో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కోఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, ఏవీఎన్ రెడ్డి అభ్యర్థిని గెలిపించాలని టీచర్లకు అవగాహన కల్పించారు. రెండు పోలింగ్ స్టేషన్ల వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.